# ఆటబొమ్మ

సినీమాలూ, రాజకీయాలూ, క్రీడలూ, వినోదాలూ వేటికీ నోచుకోని ఆ అగ్రహారం జనాభాకి కాస్త ప్రొద్దు పోతోందంటే, ఆ పుణ్యం అంతా అంబంభజామిదే!

కొందరతని ఎత్తుపళ్ళూ మిడిగుడ్లూ బానపొట్టా వంకరకాళ్లూ చూసి నవ్వుకుంటే, మరికొంద రతని వెర్రినవ్వూ పిచ్చిమాటలూ విని ఆనందిస్తారు. నాలుగువేదాల్నీ పుక్కిటబట్టిన పతంజలి శాస్త్రిగారి దగ్గర్నుంచి నాలుగు వీధుల మొగల్లోనూ సాయంత్రంపూట కిరసనాయిల్ లైటు స్తంభం వెలిగించే నారిగాడి వరకూ, ఆ అగ్రహారం జనం అందరికీ, అంబంభజామి కాస్తోకూస్తో వినోదాన్ని అందించే ఆటవస్తువే!

ఎవరు ఆటపట్టించినా, ఎవరు ఏడిపించినా, అంబంభజామి మాత్రం వెకిలినవ్వులు నవ్వుతూ కోతిగంతులు వేస్తూ వాళ్ళ మనస్సుకి ఆహ్లాదం కలిగిస్తూనే ఉంటాడు. వాళ్ళూ వీళ్ళూ గిల్లుతూఉన్నా అదేం పట్టించుకోడు. మరీ భరించలేనంత బాధ కలిగితే, 'అంబంభజామి!' అని గట్టిగా ఒక్క అరుపు అరిచి అక్కడనుంచి పారిపోతాడు.

పట్టలేని సంతోషం వచ్చినా, భరించరాని బాధ కలిగినా అతను అలాగే అరుస్తాడు. అస లతనికి ఆపేరు అందుకే వచ్చింది. నిజం చెప్పాలంటే అంబంభజామి అసలుపేరు ఆ అగ్రహారంలో ఎవరికీ తెలియదు. పదిపదిహేనేళ్లక్రితం, అంటే అతనికి పన్నెండేళ్లు ఉండగా, అగ్రహారంలో జరుగుతున్న వైష్ణవ సప్తాహానికి పొరుగూరు భజన బృందంతో వచ్చాడు. భజనమధ్యలో ఉండుండి 'అంబంభజామి' అని అరుస్తూ వుండేవాడు. వచ్చిన బృందం వెళ్ళిపోయింది కాని అంబంభజామి మాత్రం, అగ్రహారంలో ఉండిపోయాడు. అప్పటికే మెళ్ళో ఓ జంధ్యంపోగు ఉండడంవల్ల,

వాళ్ళింట్లో తద్దినానికో, వీళ్ళింట్లో మాసికానికో, ఓ శాస్త్రిగారి ఉపవాసానికో, ఓ నోమిదేవమ్మ ఉద్యాపనకో, బ్రాహ్మడిగా పనికివస్తూ, తిండికి లోపం లేకుండా రోజులు నెట్టుకు వచ్చేస్తున్నాడు.

ఎవరి ఇంట్లోనో భోజనం చెయ్యడం

ఎవరి అరుగుమీదో పడుకోవడం.

ఎవరు పనిసాయం అడిగితే వాళ్ళకి చేసిపెట్టడం.

నవ్వుతూ నవ్విస్తూ కాలక్షేపం చేసెయ్యడం - ఇదీ అతని దినచర్య. వికారమైన రూపం, వికృతమైన భాష - ఇవి తప్పిస్తే అంబంభజామిలో అవలక్షణాలేం లేవు. అందువల్ల అంతా అతణ్ణి ఎగతాళి చేసి ఏడిపించినా, ఏదో పని పురమాయించి అతనిచేత చేయించుకున్నా, అందరికీ అతనంటే అభిమానమే, గుండెల్లో ఏదో ఒక మూల ఆప్యాయతే!

అగ్రహారంలో ఏ ఇల్లాలు ఏ పిండివంట చేసుకున్నా, అంతో ఇంతో పెట్టడం, అది తీసుకుని అంబంభజామి సంతోషంతో పళ్ళు ఇకిలించి, 'అంబంభజామి' అని గట్టిగా ఓ అరుపు అరవడం, ఆ ఇల్లాలు 'పిచ్చిసన్యాసి' అని నవ్వుకోవడం, పరిపాటి.

అవధాని గారికి పొడుం నూరిపెట్టడం,

పేరిశాస్త్రిగారి ఆటక దులిపి, తాటాకు గ్రంథాలు బొత్తులుగా పెట్టడం,

పూజారి నరసింహాచారికి దేవతార్చనకోసం పువ్వులు కోసిపెట్టడం,

నడ్డిపడిపోయిన సీతమ్మబామ్మకి చెరువునుంచి మడినీళ్లు తెచ్చిపెట్టడం వంటి పెద్దపెద్ద పనులే కాదు, నారిగాడు నిచ్చెన ఎక్కి వీధిలైట్లు వెలిగిస్తూంటే, జారిపోకుండా నిచ్చెన పట్టుకోవడం,

పతంజలి శాస్త్రిగారింట్లో పనిజేసే సోవాలమ్మ, తన సుకుమారమైన చేతుల్తో, ఆవులకి వెయ్యడం కోసం, మేట్లోంచి గడ్డి లాగలేకపోతూంటే, వెళ్ళి సాయం చెయ్యడం,

పట్నంలో ఇంగ్లీషుచదువులు వెలగబెడుతూన్న శర్మా, దీక్షితులూ వంటి యువకులు, బస్సులు వెళ్ళే రోడ్డుదాకా బండిలో వెళుతూన్నప్పుడు, బురదలో కూరుకుపోయిన బండిచక్రాలు లాగలేక ఎడ్లు యాస్ట పడుతూంటే, బలంగా చక్రంపట్టి బండిని మెరకమీదికి నెట్టడం,

ఎవరి ఇంట్లో పండుగా పబ్బం వచ్చినా పప్పు రుబ్బడం, సంతర్పణల్లో, వంచిన నడ్డి ఎత్తకుండా అందరికీ మంచినీళ్ళు పొయ్యడం . . . .

- వంటి చిన్నచిన్న పనుల వరకూ అంబంభజామి చేస్తాడు... ఇదంతా చెయ్యాల్సి వచ్చిందిరా దేవుడా అని బాధపడడు. సరిగదా- ఒళ్ళంతా చేసుకుని మరీ పనిచేసి, సంతోషంతో 'అంబంభజామి' అని ఒక అరుపు అరుస్తూ ఉంటాడు.

అంబంభజామిని అడ్డం వేసుకుని, ఏమీ తోచనివాళ్ళంతా, గంటలు గంటలు కులాసాగా గడిపెయ్యడం, ఏ రోజు వీలైతే ఆరోజు వినోదంగా కాలక్షేపం చెయ్యడం పరిపాటి. అతణ్ణి పట్టుకుని కుర్రకారు సాగించే అల్లరిపనుల్ని చూసి "వెర్రివాడిని పట్టుకుని ఏవిట్రా ఆ ఏడిపించడం? పాపంరా!" అని ఊరిపెద్దలు అదిలిస్తే అదిలించడమేకాని, అతనికై అతను 'ఏవిటిది?' అని ఎదుర్కోవడం కాని, విదిలించుకుని విసుక్కోవడం కాని ఎప్పుడూ లేదు.

ఓమారు కార్తీకసంతర్పణలో, కాలేజీలో చదువుతున్న శర్మా, దీక్షితులూ, అంబంభజామికి చెరో ప్రక్కనా కూర్చుని అతనికి కిర్రెక్కించి రెచ్చగొట్టారు.

"ఒరే శర్మా? ఎన్ని బూరెలు తింటావురా నువ్వు?" అనడిగాడు దీక్షితులు.

"నేను తినలేనుగాని మా అంబంభజామి తింటాడు" అంటూ శర్మ అతనికేసి చూశాడు. అతను వెకిలినవ్వు నవ్వాడు.

"మీ అంబంభజామి పది తినగలడా?"

"పదేమీ? ఇరవై తింటాడు".

"మన అగ్రహారంలో ఇరవై తినేవాళ్ళు చాలామంది ఉన్నారోయ్. ముప్పయి తింటాడేమో అడుగు. అయిదేసి రూపాయలు పందెం".

ఇలా వాళ్ళిద్దరూ పందెం వేసుకుని, అంబంభజామి చేత ముప్పయి బూరెలు తినిపించి, ముసిముసినవ్వులు నవ్వుకున్నారు. వాళ్ళకి నవ్వులాటే అయింది కాని తర్వాత అంబంభజామికి ప్రాణాంతకం అయింది.

అజీర్తి - డోకులూ - జ్వరం.

అంబంభజామి పదిహేనురోజులదాకా కోలుకోలేకపోయాడు.

"వాళ్ళు పందెం వేస్తేమాత్రం నువ్వెందుకు తిన్నావురా పిచ్చిసన్యాసీ?" అని నలుగురూ చివాట్లు పెడుతూంటే తలవంచుకుని కన్నీళ్ళు పెట్టుకున్నాడే కాని, తనని ఇలా ముంచేసిన శర్మనీ, దీక్షితుల్నీ పల్లెత్తుమాట అనలేదు అంబంభజామి.

అలాగే ఆడపిల్లలంతా కూడబలుక్కొని ఓమారు అంబంభజామిని ఆట పట్టించాలని నిర్ణయించుకొన్నారు.

ఇరవైయేళ్ళ బాలవితంతువైన పతంజలి శాస్త్రిగారి కూతురు ఇందిర, ఆ అల్లరిపనికి నాయకత్వం వహించింది.

ఇంట్లో పెద్దవాళ్ళెవరూ లేకుండా చూసి, స్నేహితురాళ్ళని తమాషా చూడండని పక్కగదుల్లో దాచి, వీధినపోతున్న అంబంభజామిని లోపలికి పిల్చింది.

పిల్చి, "చీర మార్చుకుందామంటే, లోపలి లంగాముడి రావడం లేదు. చేతులు వెనక్కి పెట్టి విప్పుకుందామంటే ముడి కనిపించడం లేదు. కాస్త లంగాముడి విప్పవా అంబంభజామి!" అంటూ బతిమాలుతూ అమాయకంగా మొహం పెట్టి అడిగింది.

ఇందిర చేసిపెట్టమన్న పనిలో తప్పేం తోచలేదు అంబంభజామికి.

ఆమె నడ్డిమీద ఉన్న లంగాముడి విప్పడానికి ప్రయత్నం చేశాడు.

కావాలని వేసిన పేటముడేమో, అది ఓ పట్టాన రాలేదు.

"పోనీ పంటితో విప్పు" అని ఉచిత సలహా ఇచ్చింది ఇందిర.

అంబంభజామి 'అలగే' అన్నాడు.

అతని నూనూగు మీసాలు ఆమె నడ్డికి తగిలి గిలిగింతలు పెడుతున్నాయి.

ఇందిర ఉండుండి కిలకిలా నవ్వుతోంది.

ఆ నవ్వుని సంకేతంగా గ్రహించి గదుల్లో దాక్కున స్నేహితురాండ్రు, పకపకలాడుతూ, చప్పట్లు కొడుతూ బయటికి రావాలి.

కాని వాళ్ళబదులు వీధిలోంచి పతంజలిశాస్త్రి గారు వచ్చారు.

హాల్లో పైటజార్చి అటు తిరిగి నిలబడి ఉన్న ఇందిర!

ఆమె వెనకాల, ఆమె నడ్డిన ముద్దు పెట్టుకుంటున్నట్లు, కదులుతున్న అంబంభజామి!

పతంజలిశాస్త్రిగారు ప్రళయరుద్రులయ్యారు.

అంబంభజామిని గొడ్డుని బాదినట్లు బాదారు.

"అదేవిటి?" అని అంబంభజామి అడగలేదు.

'అతని తప్పులేదు' అని ఇందిర అడ్డుకోలేదు.

"రక్తాలు కారేటట్లు ఆ అమాయకుడిని ఎందుకు కొట్టారు?" అని అడిగిన ఊళ్ళోవాళ్ళ ప్రశ్నకి పతంజలిశాస్త్రిగారు సమాధానం చెప్పలేదు.

బాలవితంతువైన తన కుమార్తె ఇందిర ఎక్కడ తప్పటడుగు వేస్తుందో అన్న భయంవల్లా, నిప్పులాంటి తన వంశప్రతిష్ఠ ఎక్కడ గంగపాలవుతుందో అన్న భీతివల్లా, పతంజలిశాస్త్రిగారు ఆ రోజునుంచీ అంబంభజామిని ఆమడదూరంలో ఉంచారు.

"అసలు జరిగిందేవిటి? పరమసాత్త్వికులైన పతంజలిశాస్త్రిగారు, అంబంభజామిని ఎందుకు కొట్టారు." అన్న ఊరివారి ప్రశ్న, ప్రశ్నగానే మిగిలి పోయింది.

ఆ దెబ్బలనుంచి కోలుకోడానికి అంబంభజామికి దాదాపు నెలపట్టింది.

అప్పుడు జబ్బుపడడం.

ఇప్పుడు దెబ్బలుతినడం.

ఈ రెండూ అంబంభజామి ఆలోచనల్లో కాని, జీవితంలోకాని, మార్పేం తీసుకురాలేదు. అతను మామూలుగా మునపటిలాగే ఉన్నాడు.

ఎవరే సాయం అడిగినా చేస్తూనే ఉన్నాడు. ఎవరు తనని ఏడిపిస్తున్నా నవ్వుతూనే ఉన్నాడు. పట్టలేని సంతోషం, భరించరాని బాధా, ఏం వచ్చినా 'అంబంభజామి' అని అరుస్తూనే ఉన్నాడు.

ఓరోజు సాయంత్రం.

బాగా చీకటిపడింది.

ఇందిర, గుళ్ళో పురాణం వినడానికి వెళ్ళింది.

పనులన్నీ పూర్తిచేసి, "ఇంక వెళ్ళొస్తాను అయ్యగారూ". అని చెప్పడానికి, సావిట్లో ఉయ్యాల బల్లమీద కూర్చున్న పతంజలిశాస్త్రిగారికి సమీపంలో, నిలబడి ఉంది సోవాలమ్మ.

చదువుతున్న భగవద్గీతని ప్రక్కనపెట్టి, కళ్ళు ఇటుత్రిప్పి చూశారు పతంజలిశాస్త్రిగారు.

నుదుటను పట్టిన చిరుచెమటని పైటకొంగుతో వత్తుకుంటూ, వయ్యారంగా నుంచున్న సోవాలమ్మ సోయగం!

యౌవనం రూపుదాల్చినట్లు!

అందం రాసిపోసినట్లు!

జీవంవచ్చిన శిల్పంలా - నున్నగా మెరుస్తూన్న నల్లని సౌందర్యం!

పతంజలి శాస్త్రిగారు అటు తిరిగి చూశారు.

వీధి తలుపు వేసి ఉంది.

శాస్త్రిగారిలో మగతనం వళ్ళు విరుచుకొంది.

కోరిక కోడెత్రాచులా లేచింది.

అంతే!

ఉయ్యాలబల్లమీంచి ఒక్క ఉరుకు ఉరికి సోవాలమ్మ చెయ్యి పట్టుకున్నారు శాస్త్రిగారు.

బెదిరిపోయిన సోవాలమ్మ, అమ్మవారికి బలి అయిపోతూన్న మేకలా అరిచింది.

శాస్త్రిగారి చేతులు సోవాలమ్మ చుట్టూ బిగుస్తున్నాయి!

సోనాలమ్మ అరుపులు, గొర్రె చేస్తూన్న ఆర్తనాదాల్లా బయటికి వినిపించ సాగాయి.

వీధిన పోతూన్న అంబంభజామి ఆగాడు.

అది సోనాలమ్మ గొంతు! అగ్రహారంలో చీకట్లు తరమడానికి రోజూ దీపాలు వెలిగించే నారిగాడి భార్య గొంతు!

గాలికి రెపరెపలాడుతున్న దీపంలా, ఆమె గొంతు వణికిపోతూ వినిపిస్తోంది.

లోపల ఏం ఉపద్రం జరుగుతుందో, అంబంభజామికి అంతుపట్టలేదు.

మొత్తంమీద సోవాలమ్మ ఏదో ప్రమాదంలో ఉంది.

అంతే!

"అంబంభజామి!" అని సింహంలా ఒక్క అరుపు అరిచి, తన శక్తికొలదీ తలుపులని గట్టిగా తన్నాడు.

కర్రగడియ విరిగి, తలుపులు భళ్ళున తెరుచుకున్నాయి.

సోవాలమ్మని సంపూర్ణంగా ఆక్రమించుకోబోతూన్న పతంజలిశాస్త్రి!

ధన్‌మన్న చప్పుడు విని శాస్త్రిగారి కళ్ళు ఇటు తిరిగాయి. కొరడాతో కొట్టినట్లు ఈ లోకంలోకి వచ్చి చూస్తే, ఎదురుగా ప్రళయరుద్రుడిలా అంబంభజామి!

మొదట ప్రాణభీతి.

ఆ తర్వాత, "ఎంతపని జరిగింది? రేప్పొద్దున్న అగ్రహారంలో తల ఎత్తుకుని ఎలా తిరగడం?" అన్న ఆందోళన – మర్నాటినుంచి తనకి ఎదురయే అవమానం!

శాస్త్రిగారు సుడిగాలిలా పక్కగదిలోకి వెళ్ళి తలుపేసుకున్నారు.

పైట సవరించుకొని కళ్ళు వత్తుకొని "సమయానికి వచ్చికాపాడావు... లేకపోతేనా?" అని మళ్ళీ ఏడుస్తూ, సోవాలమ్మ వీధిలోకి పరిగెత్తింది ...

సరిగ్గా అదే సమయంలో ఇందిర గుడినుంచి వస్తూ లోపలికి అడుగు పెట్టింది -

ఆమెని తప్పించుకొని దూసుకుంటూ బయటికి వెళ్ళిపోయిన సోవాలమ్మ!

ఆవేశం ఆపుకోవడంవల్ల వచ్చిన ఆయాసంతో రొప్పుతూ నిలబడ్డ అంబంభజామి!

ఆ పరిస్థితి ఇందిరకి మరోలా అర్థం అయింది.

అంబంభజామి రెండుబుజాలూ పట్టుకుని అభినందన పూర్వకంగా కదుపుతూ "అహో! ... అయితే ఇంకనేం? మగాడివే!" అంది.

అంబంభజామి ఏం మాట్లాడలేదు. గుడ్లప్పగించి ఆమెకేసి చూస్తూ నిలబడ్డాడు - సోవాలమ్మ. పతంజలిశాస్త్రి - ఇందిర - ముగ్గురూ అతని మనస్సులో గుండ్రంగా రంగులరాట్నం తిరగసాగారు. ఇందిర చిరునవ్వు నవ్వి, "సోవాలమ్మ ఎందుకు? కావాలంటే నేను లేనూ?" అంటూ అతణ్ణి తన సందిట్లోకి తీసుకుంది.

విరిగిపడి ఉన్న గడియని చూసి సాభిప్రాయంగా నవ్వింది. నవ్వి "ఇన్నాళ్ళూ పురుషస్పర్శ తెలియక, నా జీవితానికి గడియవేసుకుని జీవిస్తున్నాను - ఇంకే గడియలూ, అడ్డులూ, ఆంక్షలూ నన్ను ఆపలేవు" అంటూ తన ఎత్తయిన గుండెలకి అతని తలని హత్తుకొని, అచేతనంగా ఉన్న అతణ్ణి తన పడకగదిలోకి నడిపించుకుని వెళ్ళబోయింది.

సరిగ్గా అదే సమయానికి, పక్క గదిలోంచి పతంజలిశాస్త్రిగారి చావుకేక వినిపించింది.

ఉలిక్కిపడి అంబంభజామిని వదిలేసి ఇందిర అటు పరిగెత్తింది.

చుట్టుప్రక్కల వాళ్ళుకూడా ఆ కేక విని పరుగుపరుగున వచ్చారు.

సమాజంలాంటి దూలానికి, కుటుంబగౌరవం అనే తాడుతో ఉరిపోసుకున్న పతంజలిశాస్త్రిగారి శరీరం వేళ్ళాడుతోంది.

విద్యుద్ఘాతం తగిలినట్లు అంతా నిర్విణ్ణులైపోయారు.

మానుషానికి లొంగి సోవాలమ్మా, కుటుంబగౌరవానికి తలవంచి ఇందిరా, మౌనంగా ఉండిపోయారు. జరిగిందేవిటో చెప్పకుండా వ్రేలాడుతూన్న శాస్త్రిగారి

శవాన్ని రవిక ఊడిన ఇందిర పరిస్థితినీ, ఉద్రేకంతో ఊగిపోతూ, దోషిలా తలవంచుకొని నిలబడ్డ అంబంభజామినీ మార్చిమార్చి చూశారు అందరూ.

దాంతో అగ్రహారీకులకి అదంతా ఒకరకంగా అర్థంఅయింది.

"ఆ రోజున నిన్ను కొట్టినందుకు, పరమ పవిత్రమూర్తి అయిన పతంజలిశాస్త్రిగారిని చంపి దూలానికి వేళ్ళాడగట్టి, నిప్పులాంటి వాళ్ళ అమ్మాయిని చెరపట్టడానికి చూస్తావా? ఈ అగ్రహారం నీకు ఇన్నాళ్ళూ అన్నం పెట్టింది. యజ్ఞవాటికలాంటి అగ్రహారాన్ని కలుషితం చేసి బ్రతుకుల్లో ఇలా విషం కక్కుతావా?" అంటూ అగ్రహారంలో ఉన్న అవధానీ, పేరిశాస్త్రీ, నరసింహాచారీ, శర్మా, దీక్షితులూ, నారిగాడూ, ఒక రేవిటి, ఊళ్ళో ఉన్న పెద్దా చిన్నా ఆడామగా అందరూ కుక్కని బాదినట్లు బాది ఇన్నాళ్ళూ ఆట బొమ్మగా ఉపయోగించుకొన్న అంబంభజామిని అగ్రహారంనుంచి తరిమేశారు. అతను పెదవి విప్పి మాట్లాడలేదు - యజ్ఞపశువులా తలవంచాడు.

మామూలుగా అయితే, దెబ్బలు తిని, పడుతూ లేస్తూ వెళుతూన్న ఆ పరిస్థితిలో, బాధగా 'అంబంభజామి!' అని అరచిఉండేవాడే!

కాని జ్ఞానోదయం అయిందేమో -

ఏ అమ్మవారినీ భజించకూడదు అని అనుకున్నాడు కాబోలు!

మౌనంగా తన దుఃఖాన్ని తనలోనే దిగమ్రింగుకుంటూ తలవంచుకుని మరీ వెళ్ళిపోయాడు.

తర్వాత అగ్రహారంలో అందరూ అతని గురించి మరిచిపోయారు, పాడైపోయిన ఆట వస్తువుని అవతల పారేసి చేతులు దులుపుకున్నట్లు -

కాని, మరువలేకపోయిన వాళ్ళు ఇద్దరు. ఇందిర - సోనాలమ్మ. ఇందిర ఎప్పుడేనా ఏకాంతంగా ఉన్నప్పుడు గుప్పిళ్ళు నోటికి అడ్డం పెట్టుకుని మౌనంగా ఏడుస్తూ ఉంటుంది, చేజారిపోయిన అదృష్టానికి -

సోనాలమ్మమాత్రం రోజూ, నారిగాడు అగ్రహారంలో దీపం వెలిగించి నప్పుడల్లా, దీపానికి నమస్కారం చేసి, "ఈ దీపం ఆరిపోకుండా కాపాడింది నువ్వే నయ్యా," అంటూ కనిపించకుండా కనుమరుగైపోయిన అంబంభజామికి అశ్రు తర్పణం అందిస్తూ ఉంటుంది, తప్పిపోయిన తన దురదృష్టాన్ని తల్చుకుంటూ.

(ఉదయం నవతరం పత్రిక, 23-2-1990)

*